# నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL


## ❖ బీసీలకు తీరని అన్యాయం చేశారు



మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 6: కుల గణనలో బీసీలకు తీరని అన్యాయం జరిగింది. అసలు కుల గణన అనేది అందరికీ నచ్చినట్లు కాకుండా వారికి అనుగుణంగా చేసుకున్నారని చెప్పవచ్చు. ఇందులో అన్ని కులాలకు ప్రాధాన్యత దక్కలేదు. ఈడబ్ల్యూఎస్ ప్రస్తావన రాలేదు. బీసీలు తగ్గి రెడ్డి, రావులు పెరిగినట్లు కుల గణనలో చూపుతున్నారు. రాష్ట్రంలో బీసీలతో పాటు మైనార్టీ బీసీలను కలిపితే మొత్తం 60 శాతానికి పైగా జనాభా ఉంటుంది. కానీ ప్రభుత్వం తప్పుల తడకగా పేర్కొన్నది. మాలమాదిగ, బహుజనులు కోటా కోసం పోరాడుతున్నారు. వారిని కూడా మోసం చేస్తున్నారు. బీసీల్లో కూడా అందరికీ అవకాశం దక్కాలి. సామాన్యుడికి బీసీ గణన చేరలేదు. బీసీ గణనపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంచిర్యాలలో శుక్రవారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మౌనప్రదర్శన చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో బీసీ జనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

**- డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా కన్వీనర్**



ఇంద్రవెల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటాలను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

### రేవంత్‌రెడ్డి ఎస్సీల్లో ఐక్యతను దెబ్బ తీస్తున్నాడు..

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 : రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తూ ఉపకులాలవారీగా తప్పుడు రిజర్వేషన్లు కల్పించడంతో ఎస్సీలకు నష్టం కలుగుతుందని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలను దహనం చేశారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలలోని ఐక్యతను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తుందన్నారు.

## ❖ ఎస్సీ వర్గీకరణతో నష్టం



ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు రిజర్వేషన్ల పరంగా నష్టం కలుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని ఎస్సీలపై సర్వే చేయించింది. ఎస్సీ వర్గీకణను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలి. కులగణన సర్వే తప్పుల తడకగా ఉంది. ఇప్పటికే ఎస్సీలలోని అనేక కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధికి దూరం అవుతున్నాయి.

**- కామ్‌రాజ్ వాగ్మారే, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి.**




# సంకుల సమరం

## కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతున్న బీసీలు, దళితులు

- **42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం లేదంటున్న బీసీలు**
- **11 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనంటున్న మాదిగల పట్టు**
- **వర్గీకరణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న మాలలు**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలు దహనం**

మంచిర్యాల, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కులగణన సర్వే నివేదికపై అన్ని వర్గాల నుంచి నిరసన వ్యక్తం అవుతున్నది. సర్వే సరిగా లేదంటూ బీసీలు, దళితుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తున్నది. కులగణన నివేదిక తప్పుల తడకగా రూపొందించారని, దురుద్దేశపూర్వకంగా బీసీ జనాభాను తగ్గించి చూపారని కాంగ్రెస్ సర్కారుపై బీసీలు రగిలిపోతున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను విస్మరించి, కేవలం కాంగ్రెస్ పార్టీ పరంగా వాటా కల్పిస్తామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, రాష్ట్రంలోని బీసీలను వెన్నుపోటు పొడిచిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా చేసిన ఇంటింటి సర్వేను పక్కన పెట్టి ఎస్సీ వర్గీకరణకు పోవడంపై దళితులు ఆగ్రహంతో ఉన్నారు. మాదిగలకు అన్యాయం చేశారంటూ ఆ సామాజిక వర్గం నాయకులు అంటున్నారు. రాష్ట్రంలో 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్ ఇస్తే, 52 లక్షల జనాభా ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పాత లెక్కలను అనుసరించి 9 శాతం ఇవ్వడాన్ని మాదిగలు తీవ్రంగా తప్పు బడుతున్నారు. మరోవైపు మాల సామాజిక వర్గం ఎస్సీ వర్గీకరణపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. తాము కూడా వర్గీకరణతో నష్టపోతున్నామంటున్నారు. ఇలా బీసీ, మాదిగ, మాల సామాజిక వర్గాలు ఎవరికి వారు సర్కారు తీరుపై మండిపడుతున్నాయి.

### కాంగ్రెస్‌లో చీలిక

కులగణన సర్వే నివేదిక తప్పులతో జనాల్లో వ్యతిరేకత పెరగగా.. అధికారిక కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర స్థాయి నుంచి మండల, గ్రామస్థాయి దాకా ఆ పార్టీ నాయకుల్లో చీలక వచ్చినట్లు తెలుస్తున్నది. రాష్ట్రంలో బీసీ జనాభా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బీసీలకు డిప్యూటీ సీఎం సహ మరో రెండు మంత్రి పదవులకు బీసీ లీడర్లు అధిష్టానం ముందు పట్టుపడుతున్నారట. ఇక ఎస్సీ వర్గీకరణపై మాదిగ, మాల సామాజిక వర్గం ఎమ్మెల్యేలు రెండుగా చీలిపోయారనే వార్తలు వస్తున్నాయి. మాలల పక్షాన వర్గీకరణపై చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఢిల్లీకి వెళ్లి మరీ లాబీయింగ్ చేస్తున్నట్లు పలు వార్తా కథనాలు వస్తున్నాయి. మరోవైపు మాదిగ సామాజిక వర్గం నాయకులు ఇప్పుడు ఇస్తామంటున్న 9 శాతం రిజర్వేషన్లు 11 శాతానికి పెంచాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో పార్టీలోని దళిత నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెలుస్తున్నది. అదే తరహాలో జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో పొరపొచ్చాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకతిస్తూ ఉమ్మడి జిల్లాలో దళిత నాయకులు ఇప్పటికే రోడ్లపైకి వచ్చారు. ఇంద్రవెల్లిలోఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు నాయకులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలను దహనం చేశారు. దేశ జనగణలో కులగణన జరపాలని పార్లమెంట్ సమావేశాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టి అమలు పర్చాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపి రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

## ❖ మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి..



నిర్మల్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన కులగణన ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పిన లెక్కల మేరకు రాష్ట్రంలో 15 శాతం మంది మాలలు ఉన్నారు. వారికి 5 శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు, అదే నిష్పత్తి ప్రకారం 32 శాతం ఉన్న మాదిగలకు జనాభా ప్రాతిపదికన 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 శాతం మాత్రమే కేటాయించి మాదిగలకు మోసం చేసింది. వాస్తవానికి జనాభా ప్రకారం చూస్తే మాలలకు 3 శాతం మాత్రమే వర్తింపజేయాలి. గతంలో మాదిగలు, మాలలు, వాటి ఉప కులాలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించి రిజర్వేషన్లు అమలు చేశారు. అప్పుడు కొంత వరకు మాదిగలకు న్యాయం జరిగింది. ఇప్పుడు నాలుగు గ్రూపులను 1,2,3 కేటగిరీలు చేశారు. మాదిగల కేటగిరీలో ఉన్న బుడగ జంగాలను 1వ కేటగిరీలో కలుపడంతో లక్షకు పైగా జనాభా ఉన్న వారు 2వ కేటగిరీలో తగ్గిపోయారు. దీంతో మాదిగల జనాభా మరో లక్ష వరకు తగ్గింది. మాదిగలకు రిజర్వేషన్లు తగ్గించాలన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కొత్త నాటకాలకు తెరలేపింది. మాదిగలు, మాలలకు మధ్య చిచ్చు పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి వివాదాలను సృష్టిస్తున్నది. 30 ఏళ్లుగా ఎస్సీల వర్గీకరణ కోసం మాదిగలు అనేక పోరాటాలు చేయగా, ఇటీవలే సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ వర్గీకరణ ఫలాలు మాదిగలకు పూర్తి స్థాయిలో అందకుండా చేస్తున్న కాంగ్రెస్ పాలకుల కుట్రలను సమర్థవంతంగా తిప్పికొడతాం. అవసరమైతే మరిన్ని ఆందోళనలు చేపట్టి 11 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు మాదిగలతో కలిసి పోరాడుతాం. **- శ్యాంసుందర్, బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త**



నిర్మల్ కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి నాయకులు

### బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి..

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 6 : పార్లమెంట్ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టి అమలు పర్చాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు విలాస్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రూ.2 లక్షల కోట్లతో బీసీ సంక్షేమ, అభివృద్ధి కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. బీసీ అట్రాసిటీ చట్టాన్ని రూపొందించాలన్నారు. జిల్లాల్లో బీసీ భవనాలు నిర్మించాలని, బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## ❖ రాజ్యంగ విరుద్ధం



ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీల వర్గీకరణతో దళిత బహుజనులకు రిజర్వేషన్ల పరంగా నష్టం జరుగుతుంది. ఎస్సీలను కులాలవారీగా విడదీసి రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంది. ఎస్సీల ఐక్యతను చెల్లా చెదురు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేసింది. ఎస్సీ వర్గీకణను ప్రభుత్వం రద్దు చేసి దళిత బహుజనులకు న్యాయం చేయాలి. వర్గీకరణ చేయడంతో ఎస్సీలలో ఉన్న ఉప కులాలకు నష్టం తప్ప న్యాయం జరగదు. **- కాంబ్లే అతిష్, దళిత సామాజిక కార్యకర్త.**

## సమస్యలను పరిష్కరించాలి

**ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షా**



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 : ప్రజావాణికి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకు శాఖలవారీగా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ప్రజావాణిని పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ప్రజావాణిని ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలంలో ప్రారంభించామన్నారు. మండల కేంద్రంలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యురాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయా, జడ్పీ సీఈవో జితేందర్, డీఆర్‌డీఏ పీడీ రాథోడ్ రవీందర్, కిసాన్ మిత్ర రాష్ట్ర కో-ఆర్డినేటర్ శ్రీహర్ష, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, జేఆర్‌వో రాథోడ్ గణేశ్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఎంపీవో జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, ఫిబ్రవరి 6 : పదో తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం బీసీ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ప్రీ మెట్రిక్ వసతి గృహ పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులకు స్టడీ, ఎగ్జామ్స్, మెటీరియల్‌ను అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు పరీక్షలపై భయం పోగొట్టి, మంచి మార్కులు సాధించేలా కృషి చేయాలని సూచించారు. గత పరీక్షల్లో వచ్చిన ప్రశ్న పత్రాలను విశ్లేషించుకుని చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారులు రాజలింగు, సునీత, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, సబ్జెక్ట్ నిపుణులు కంఠేశ్వర్, ప్రవీణ్, రమాకాంత్‌రెడ్డి, విఠల్, సుశీల, మురళీధర్ పాల్గొన్నారు.

# అదుపులేని కోతులు.. నియంత్రణ లేని సంతానం

## నిర్మల్‌లోని రెస్క్యూ సెంటర్‌లో పెరగని స్టెరిలైజేషన్లు

- **నాలుగేళ్లలో ఇప్పటి వరకు 1547 స్టెరిలైజేషన్లు మాత్రమే**
- **రాష్ట్రంలో ఏకైక సెంటర్ ఇక్కడే**
- **కోతుల ఆగడాలతో బెంబేలెత్తుతున్న జనం**
- **బీఆర్ఎస్ హయాంలో సెంటర్ ఏర్పాటు**
- **కోతుల పట్టివేతపై ప్రస్తుత సర్కారు నిర్లక్ష్యం**



నిర్మల్‌లో ఏర్పాటు చేసిన కోతుల స్టెరిలైజేషన్ భవనం



ఆపరేషన్ అనంతరం కోతి నుదిటిపై టాటూ(ఫైల్)

నిర్మల్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన సామాజిక సమస్యగా మారిన కోతుల పెరుగుదల వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోతుల ఆగడాలు తాళలేక సాధారణ ప్రజలతోపాటు రైతులు బెంబేలెత్తుతున్నారు. వీటి సంతాన ఉత్పత్తి ప్రక్రియ వేగంగా కొనసాగుతూ ఉండడం ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. రాత్రింబవళ్లు కోతుల సంచారంతో పాటు వాటి ఆగడాలు మితిమీరి పోతుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకున్నది. అలాగే పొలాలపై కూడా కోతుల గుంపులు దాడులు చేసి పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నది. ఇలాంటి సమస్యల కారణంగా గత కేసీఆర్ ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో నిర్మల్ శివారులోని గండి రామన్న హరితవనం ప్రాంగణంలో మంకీ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనే ఏకైక మంకీ రెస్క్యూ సెంటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు కోతుల బాధ నుంచి విముక్తి కలుగుతుందని ఆశించారు. అయితే వన్యప్రాణుల రక్షణ చట్టానికి అనుగుణంగా కోతులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం లేకపోవడంతో ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం ఒక డాక్టర్‌తోపాటు ఫార్మాసిస్టు, నలుగురు అటవీ సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లోని ప్రతికాలనీలో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, వాటి ఆగడాలు శృతి మించుతున్నప్పటికీ మున్సిపాలిటీలు, పంచాయతీలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీలు, పంచాయతీలు కోతులను పట్టించి ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌కు తీసుకొస్తే వాటికి స్టెరిలైజేషన్(కుటుంబ నియంత్రణ) ఆపరేషన్లు చేయాల్సి ఉంటుంది. కోతుల జనాభాను తగ్గించాలంటే కేవలం నియంత్రణ ఆపరేషన్లు తప్ప మరో మార్గం లేదు. వేగంగా వాటి సంతానం పెరుగుతుండడంతో వీటి సంతానాన్ని అరికట్టడమే సమస్యకు శాశ్వత పరిషార మార్గమని వైద్యులు చెబుతున్నారు. నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు స్థానిక సంస్థల నిర్లక్ష్యం కారణంగా కేవలం 1547 స్టెరిలైజేషన్లు మాత్రమే చేశారు. ఇక్కడి మంకీ రెస్క్యూ సెంటర్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉండడంతో నెలకు దాదాపు 500లకు పైగా కోతులకు స్టెరిలైజేషన్ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కో కోతిని పట్టేందుకు రూ.వెయ్యి వరకు ఖర్చు అవుతుండడంతో అసలే నిధుల కొరతతో సతమతమవుతున్న పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఇది మరింత భారంగా మారింది. కోతుల సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ, నిధుల కొరత కారణంగా వాటిని పట్టించే పరిస్థితి లేకుండా పోయిందని పలువురు మాజీ సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు పేర్కొంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ చూపి కోతుల సమస్యను నివారించేందుకు నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్న డిమాండ్ తెరపైకి వస్తున్నది. ఇందుకోసం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసి కోతులను పట్టించి రెస్క్యూ సెంటర్‌కు తరలించే బాధ్యతను పూర్తిగా ప్రభుత్వమే తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే కోతుల ఆగడాలు శృతి మించి ప్రజలు ఇళ్లకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే చేలను కోతుల బారి నుంచి కాపాడుకోవడం రైతులకు భారంగా మారుతుంది.

### వీడీసీలు ముందుకు రావాలి..

ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అనేక గ్రామాల్లో కొనసాగుతున్న వీడీసీ(విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ)లు కోతుల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ప్రజల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో వీడీసీలు సమాంతర వ్యవస్థ నడుపుతుండడమే కాకుండా అక్కడి ఆర్థిక వనరులన్నింటినీ తమ గుప్పిట్లో ఉంచుకున్నాయన్న వాదనలున్నాయి. ఇసుక వ్యవహారాలు, బెల్టు షాపులు, కూల్‌డ్రింక్ దుకాణాలు, కల్లు దుకాణాల నిర్వహణ బాధ్యతనంతా ఈ వీడీసీలే నిర్వహిస్తున్నాయన్నది బహిరంగ రహస్యం. గ్రామ పంచాయతీల కన్నా వీడీసీలే ఆర్థికంగా బలంగా ఉండడంతో కోతుల తరలింపు బాధ్యతను కూడా ఆయా వీడీసీలే తీసుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### స్టెరిలైజేషన్ గుర్తింపు కోసం కోతులకు టాటూలు..

నిర్మల్‌లోని మంకీ రెస్క్యూ సెంటర్‌లో స్టెరిలైజేషన్ చేసిన కోతులకు ఇక్కడి వైద్య సిబ్బంది వాటి నుదుటిపై టాటూలు వేస్తున్నారు. ఇలా టాటూలు కనిపించిన కోతికి స్టెరిలైజేషన్ పూర్తయినట్లు తెలిసిపోతుంది. స్టెరిలైజేషన్ పూర్తయిన కోతులకు ఇక సంతానోత్పత్తికి అవకాశం ఉండదు. దీంతో క్రమంగా వాటి సంఖ్యను తగ్గించవచ్చని వైద్యాధికారి పేర్కొంటున్నారు. అయితే నాలుగేళ్లలో ఇక్కడి సెంటర్‌లో 1547 ఆపరేషన్లు మాత్రమే నిర్వహించారు. 2 నుంచి 3 ఏళ్ల వయసు ఉండడం లేదా వయసు తక్కువగా ఉన్నప్పటికీ బలంగా ఉన్న కోతులకు స్టెరిలైజేషన్ చేస్తున్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా వానరాల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇక్కడ అన్ని రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ, కోతులను పట్టుకొని తీసుకొచ్చే వారే కరువయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోతుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై నిర్మల్ మంకీ రెస్క్యూ సెంటర్ మెడికల్ ఆఫీసర్ శ్రీకర్‌రాజును అడుగగా.. పంచాయతీలు, మున్సిపాలిటీలు చొరవ తీసుకుని కోతులను పట్టించి సెంటర్‌కు తీసుకురావాలని, ప్రతినెల 500లకు పైగా స్టెరిలైజేషన్ చేసే సదుపాయాలు ఉన్నాయన్నారు.

## ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా



నిర్మల్ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 6 : ఈ నెల 9వ తేదీ తర్వాత రాష్ట్ర జేఏసీ నాయకులు ఎప్పుడు సమ్మెకు పిలుపు నిచ్చినా తాము సిద్ధంగా ఉన్నట్లు ఆర్టీసీ ఉద్యోగులు తెలిపారు. గురువారం నిర్మల్ ఆర్టీసీ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ పరంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, 2017 పేస్కేలుకు సంబంధించిన ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో విలీన ప్రక్రియ అమలు చేసి 2021 పేస్కేలును అమలు పరచాలన్నారు.

## 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

సోన్, ఫిబ్రవరి 6 : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కడ్తాల్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులు, కడ్తాల్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కడ్తాల్ జాతీయ రహదారి 'వై' జంక్షన్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీ ఇప్పటికే సమస్యాత్మక ప్రదేశానికి వెళ్లి వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించిందన్నారు. రహదారి సమస్య పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జాతీయ రహదారి ఇంజినీరింగ్ అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి పూర్తి వివరాలతో ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేయాలన్నారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకీ షర్మిల, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, అదనపు ఎస్పీలు రాజేశ్ మీనా, ఉపేందర్‌రెడ్డి, ఆర్డీవో రత్నకల్యాణి, ఆర్అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, తహసీల్దార్ మల్లేశ్, ఎంపీడీవో సురేశ్ పాల్గొన్నారు.